శిథిలావస్థలో కిన్నెరసాని బ్రిడ్జి



శిథిలావస్థకు చేరిన కిన్నెరసాని ప్రాజెక్టు బ్రిడ్జి

- పర్యాటకులకు పొంచి ఉన్న ప్రమాదం
- గుంతలమయంగా డీర్ పార్క్ రోడ్డు

పాల్వంచరూరల్: ప్రకృతి అందాలకు నిలయమైన మినీ ఊటీని తలపించే కిన్నెరసాని ప్రాజెక్టు బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. పర్యాటకులకు ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కిన్నెరసాని గ్రామపంచాయతీలోని కిన్నెరసాని ప్రాజెక్టును 1965 నుంచి 1972 వరకు నిర్మాణం పూర్తి చేశారు. ప్రాజెక్టు దిగువ భాగంలో డీర్ పార్క్, ఎగువన గుట్టల మధ్య కాటేజీలు, అద్దాల మేడ నిర్మించారు. జలాశయంలో బోటింగ్ షికారు కోసం, ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిషా తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.

నెలకు రూ.6 లక్షల పైన ఆదాయం...

కిన్నెరసాని ప్రాజెక్టును వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల నుంచి వైల్డ్‌లైఫ్ చెక్ పోస్టు ద్వారా పర్యాటకుల నుంచి వసూలు చేసిన టికెట్ల ఆదాయం నెలకు రూ.6లక్షల పైనే ఆదాయం వస్తుంది.

సౌకర్యాలు కల్పించడంలో విఫలం..

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని సందర్శించే పర్యాటకుల ద్వారా డబ్బులు తీసుకుంటున్న వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు పర్యాటకులకు మాత్రం సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జిపై పొంచి ఉన్న ప్రమాదం...

కిన్నెరసాని ప్రాజెక్టు బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో బ్రిడ్జి పైభాగంలో పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉంది. పర్యాటకులు బ్రిడ్జి అంచులు పట్టుకుని జలాశయాన్ని తిలకిస్తుంటారు. ఈ సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గతంలో జలాశయాన్ని వీక్షించడానికి వచ్చిన ఏడుగురు విద్యార్థులు జలాశయంలోకి దిగి నీటమునిగి మృతి చెందారు. ఇంకా పలువురు జలాశయంలో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.



బ్రిడ్జి మధ్యలో బీటలు బారిన దృశ్యం

ప్రధాన రహదారి అధ్వానం..

కిన్నెరసానిలో వైల్డ్‌లైఫ్ చెక్ పోస్టు, డీర్ పార్క్, బోటింగ్ పాయింట్ మీదుగా ప్రాజెక్ట్ మీదకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అయినా ఇటు కేటీపీఎస్ అధికారులు గానీ అటు వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు గానీ రోడ్డుకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండడంతో పర్యాటకుల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది.



ప్రమాదకరంగా ఉన్న డీర్ పార్క్ రోడ్డు

మరమ్మతులు నిర్వహించాలి...



నిత్యం పర్యాటకులు సందర్శించే కిన్నెరసాని ప్రాజెక్టు బ్రిడ్జిని సంబంధిత అధికారులు మరమ్మతులు చేసి పర్యాటకులకు భద్రతను కల్పించాలి. ఇలా ఉంటే ఒకసారి వచ్చిన పర్యాటకులు మరోసారి ఎలా వస్తారు.

– వెంకన్న, యానంబైల్

ఎవరూ పట్టించుకోవడం లేదు..



కిన్నెరసాని ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. పర్యాటకుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్డును వైల్డ్‌లైఫ్, కేటీపీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. మరమ్మతులు చేపడితే పర్యాటకులు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

– బుడగం నాగేశ్వరరావు, యానంబైల్

ప్రతిపాదనలు పంపించాం..



కిన్నెరసాని ప్రాజెక్టు బ్రిడ్జి మరమ్మతుల కోసం రూ.7లక్షల వ్యయంతో జెన్కో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. వారి నుంచి అనుమతులు రాగానే వెంటనే బ్రిడ్జిపై మరమ్మతులకు చర్యలు చేపడుతాం.

– ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ ఇంజనీర్

క్లుప్తంగా

నేడు బీజేపీ చీఫ్ రాక

ఇల్లెందు: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు బుధవారం ఇల్లెందుకు రానున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



శివయ్యకు పార్టీ కండువా కప్పుతున్న మహేష్‌కుమార్

ఇల్లెందు: ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌లను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిశారు. కామేపల్లి మండలం జాస్తీపల్లి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర నాయకుడు తోటకూర శివయ్య.. వారి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి రాంబాబు, షేక్ ఫతే అహ్మద్, ఏపూరి మహేందర్ కుమార్ ఉన్నారు.

2న హుండీ లెక్కింపు

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 4వ తేదీన పెద్దమ్మతల్లి ఆలయంలోని వ్యాపార దుకాణాలు, ఏసీ ఫంక్షన్ హాల్స్, చీరలు, కొబ్బరిచిప్పల పొగు లీజు లైసెన్స్ హక్కులు కోసం బహిరంగ వేలంపాటలు, టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

సింగరేణి(కొత్తగూడెం): ఇల్లెందు ఏరియాలోని సోలార్ ప్లాంట్ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావలీ వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఇల్లందులో సోలార్ సెంటర్‌ను బీహెచ్ఈఎల్ కంపెనీ సోలారీస్ కంపెనీకి సబ్‌లీజుకు ఇచ్చారని, సంబంధిత కాంట్రాక్టర్ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే..

పాల్వంచ: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ రాజకీయ లబ్ధి కోసమే లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తీసేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని సేవాలాల్ సేన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన జనాభాలో లంబాడీలు 70శాతం ఉన్నారని, కేవలం 30 శాతం మాత్రమే తెల్లం వెంకట్రావ్ సామాజిక వర్గం ఉందన్నారు. సమావేశంలో లాకావత్ స్వరాజ్, శివ, జర్పుల పరమేష్, గణేష్ పాల్గొన్నారు.

కేఓసీలో టెండర్ పిలవండి..

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో సివిక్ మెయింటెనెన్స్ టెండర్ వెంటనే పిలవాలని ఐఎన్‌టీయూసీ కేఓసీ పిట్ సెక్రటరీ బాలాజీ, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ షావలీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేఓసీలో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... కేఓసీలోని సివిక్ మెయింటెనెన్స్ టెండర్ జూన్ 1న అయిపోయిందని సింగరేణి అధికారుల జాప్యం వల్ల భూనిర్వాసితులైన కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు. రామ్‌మూర్, వెంకటేష్, అవినాష్, వెంకటనర్సు, బాలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

సుజాతనగర్: సింగభూపాలెం గ్రామం నుంచి గుట్ట ముసలమ్మ గుడి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సింగభూపాలెం గ్రామ సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డును పరిశీలించారు. పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ.. సింగభూపాలెం గ్రామం నుంచి గుట్ట ముసలమ్మ గుడి వరకు సుమారు 1000 ఎకరాలు మేర సాగవుతోందని, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వలన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాత్రాల తిరుపతిరావు, లిక్కి నాగరాజు, చిమట వెంకటేష్ రమేష్ పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

జూలూరుపాడు: పని గంటలు పెంచే జీఓ 282 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో 31న కలెక్టరేట్ ఎదుట జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాయల సిద్ధు, కార్మికులు పాల్గొన్నారు.

సొసైటీని విత్తనోత్పత్తి కేంద్రంగా ఎంపిక చేయాలి



చెక్ అందజేస్తున్న వీరహనుమంతరావు

చుంచుపల్లి: విత్తనోత్పత్తి కేంద్రంగా కొత్తగూడెం సహకార సంఘాన్ని ఎంపిక చేయాలని సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతూ.. సొసైటీని విత్తనోత్పత్తి కేంద్రంగా ఎంపిక చేస్తే ఈ ప్రాంతంలోని రైతులు వరి, జీలుగ పంటలు పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేయవచ్చన్నారు. కొత్తగూడెం సహకార సంఘాన్ని ఎఫ్‌పీఓగా ఎన్నిక చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సహకార సంఘంలో అప్పు తీసుకొని ఇటీవల మరణించిన వజ్జా అబ్బులు భార్య చుక్కమ్మకు రూ.50,000 ఇన్సూరెన్స్ చెక్ అందించారు. కూచిపూడి జగన్నాథరావు, గుగులోతు చందర్, తీట్ల విజయకుమారి, కర్నాటకపు రాంచందర్‌రావు, గుగులోతు విజయ, కంటెం సత్యనారాయణ, పండ్ల సారయ్య పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించండి..

టేకులపల్లి: కోయగూడెం ఓసీలో బ్లాస్టింగ్ వల్ల, బొగ్గు డంపింగ్ వల్ల కిష్టారం గ్రామంలో ఆదివాసీల ఇళ్లు బీటలు వారి ప్రమాదకరంగా మారుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడే రేపాకుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కిష్టారం గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ.. బొగ్గు మసి, దుమ్ముతో పంటలు పండడం లేదని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. సింగరేణి సంస్థ భూసేకరణ సందర్భంలో మాయమాటలతో గిరిజనులను మోసం చేశారని విమర్శించారు. కిష్టారం గ్రామంలో ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన, కేఓసీలో బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న, జోగ దశరథ్, చింత రమేష్ బాబు, జబ్బ రామకృష్ణ, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: ఈ నెల 21న పిడుగుపాటుకు గురై 13 మేకలు మృతి చెందిన కేసుపాక పుల్లయ్య కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాత్రాల తిరుపతిరావు, బచ్చలికూర శ్రీను, గండమల భాస్కర్, చిత్తారి రాజా తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్ షాపులో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో కార్మికులకు వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అత్యవసరమన్నారు. లట్టి జగన్మోహన్, జీ.వెంకటరెడ్డి, ఊట్ల గణేష్, ఎం.శ్రీనివాస్, ఇనుపనూరి నాగేశ్వరరావు, చందర్ పాల్గొన్నారు.

తహసీల్‌కు చేరిన భూవివాదం

ఇల్లెందురూరల్: పూసపల్లి గ్రామ శివారులో విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీల ప్రజలు సాగు చేసుకుంటున్న భూమి సరిహద్దు వివాదం మంగళవారం తహసీల్దార్ వద్దకు చేరుకుంది. గతంలో 588 సర్వే నంబర్‌లో 7.03 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సింగరేణికి అప్పగించారు. సదరు భూమిపై రైతులు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో వివాదం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. అయితే వివాదాస్పద భూమి పక్కనే దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిలో రైతులు దుక్కులు సిద్ధం చేయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న సింగరేణి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది రైతులను తహసీల్‌కు తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదన విన్న తహసీల్దార్ రవికుమార్ వివాదాస్పద భూమితోపాటు పక్కనే ఉన్న భూమినొ కూడా సాగు చేసుకోవాలని తాము చెప్పలేదని చెప్పారు. పరిష్కారం లభించకపోవడంతో మళ్లీ సింగరేణి, రైతుల మధ్య వివాదం జరగనుందని సర్వత్రా వినిపిస్తోంది.



తహసీల్ వద్ద రైతులు

పోలీసుస్టేషన్ తనిఖీ

ఇల్లెందురూరల్: కొమరారం పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ చంద్రభాను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో క్రైమ్ వివరాలు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సై నాగుల్‌మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో...

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రంలో ఎంఈఓ ప్రభుదయాళ్ మంగళవారం తనిఖీ చేపట్టారు. పిల్లలతో కాసేపు గడిపారు. ఆహ్లాదకరమైన పరిస్థితులలో కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరించారు.

ఉపాధి కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): ట్రాన్సిట్ గెస్ట్‌హౌజ్ కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపి, జీఎం పర్సనల్ (వెల్ఫేర్) జీవీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి ట్రాన్సిట్ గెస్ట్ హౌస్‌ను మరమ్మతుల పేరుతోటి మూసివేశారని, అందులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించకపోవటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని వాపోయారు. వెంటనే వీరికి ఉపాధి కల్పించాలని కోరారు.

స్కూల్‌లో మొక్కలు నాటిన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 45 మొక్కలు నాటారు. అనంతరం చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భాస్కర్‌రావు, భుక్యా నాగేశ్వరరావు, వెంకట్రావ్, శివ, రాంబాబు, రాంసింగ్, హీరాలాల్, దరియా సింగ్, తుకారం, రాజేంద్రప్రసాద్, లవయ్య, మహేష్, ఫుల్‌సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడు మృతి

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన గుమ్మడి నరేశ్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు గుమ్మడి రిచిత్ భార్గవ్ (7) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు.

మద్యంషాపుల నిర్వహణకు ఆమోదం

టేకులపల్లి: మండలంలో నాలుగు మద్యం షాపుల నిర్వహణకు ఎట్టకేలకు గ్రామసభ ఆమోదం లభించింది. మంగళవారం టేకులపల్లి, దాసుతండా గ్రామ పంచాయతీల్లో మద్యం షాపులు కావాలా వద్దా అనే అంశంపై పీసా గ్రామసభలు స్పెషల్ ఆఫీసర్ నీరుడు అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. టేకులపల్లిలో 156 మంది, దాసుతండాలో 260 మంది చేతులు ఎత్తి అంగీకారాన్ని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శులు ఉప్పు దీప్తి, గోపాలరావు, గణేష్, బాలు, మంగీలాల్, మూడ్ బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా అశ్వారావుపేటలో సీపీఐ జిల్లా మహాసభలు జరిగాయని మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మహాసభలో 30 మంది జిల్లా కార్యవర్గం, 79 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. జాతీయ నాయకత్వం సూచన మేరకు 10 శాతం యువతకు, 10 శాతం మహిళలకు కమిటీలో ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. ప్రధానమైన తీర్మానాలలో సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగు నీరందించాలని, కొత్తగూడెం ఇల్లెందులలో ఓపెన్ కాస్టు గనులను ప్రారంభించాలని, ఆంధ్రలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, జర్నలిస్టులు, అడ్వకేట్లకు నామినల్ ధరలకే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తదితర తీర్మానాలను మహాసభలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు పేర్కొన్నారు. ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ సలీం, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

‘ఎన్నికల హామీ మరిచిన పాలకులు’

ఇల్లెందు: పట్టణంలోని 19, 20 వార్డులు స్టేషన్ బస్తీ ఎరుకలవాడ కాలనీ వర్షం వస్తే.. బుగ్గవాగు పొంగి బస్తీ మునక తప్పటం లేదు. ఏటా వర్షాకాలం వస్తే ఎరుకులవాడకు వచ్చే నాయకులు హామీలు ఇచ్చి ఆ తర్వాత అడ్రస్ లేకుండా పోతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ విమర్శించారు. మంగళవారం స్టేషన్ బస్తీలో సీపీఎం బృందం పర్యటించింది. స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సీపీఎం బృందంలో మోహన్‌రావు, బోస్, రాము, మాధవి, వజ్జా సురేష్, బాలరాజు, కాంతమ్మ, ఉప్పలమ్మ, సావిత్రి, అంజయ్య పాల్గొన్నారు.

6న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభ

ఇల్లెందు: ఆదివాసీల అణిచివేతకు నిరసనగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని సీపీఎం అనుబంధ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) కోరింది. మంగళవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో సంఘ సమావేశంలో రాష్ట్ర నాయకుడు వజ్జా సురేష్ మాట్లాడుతూ... ఆదివాసీ అస్తిత్వం, భాష, సంస్కృతి సంప్రదాయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆదివాసీ తెగల మనుగడ కోసం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలన్నారు. దేశంలో మాత్రం ఆదివాసీల అణిచివేత జరుగుతోందన్నారు. ఖనిజ సంపద, గనుల పేరుతో భూములు లాక్కొని కార్పొరేట్‌కు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఆగస్టు 6న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సభ, ఇల్లెందు మండల మహాసభ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.బోస్, వాసం రాము, మూతి రాజశేఖర్, రఘు, ఆరెం శ్రీను, ముడిగే రాములు, పూనెం భవానీ, బక్కయ్య, తోలెం కుమారి పాల్గొన్నారు.

బస్టాప్‌లకు అనుమతులివ్వండి..



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: జిల్లా కేంద్రం కొత్తగూడెం మొదలుకొని వివిధ మండలాల్లోని విద్యా సంస్థల వద్ద బస్టాప్‌లు ఏర్పాటు చేయాలని, సమయానుగుణంగా విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని, బడి బస్సులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ.. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం బస్సు డిపో మేనేజర్‌కు ఎం.దేవేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ మాట్లాడుతూ... కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్, రామచంద్ర డిగ్రీ, పీజీ కళాశాలలు, పలు ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయని వాటి వద్ద ఆర్టీసీ బస్సులను నిలపాలని కోరారు. ఎక్కువ మంది పేదవిద్యార్థులు బస్సుల్లోనే విద్యాసంస్థలకు హాజరవుతున్నారని అధికారులు వెసులుబాటు కల్పించాలన్నారు. వి.భార్గవ్, కె.నిఖిల్, వి.నవదీష్, సన్నీ, యశ్వంత్, వి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష ప్రచార కమిటీ ఎన్నిక

పాల్వంచ: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా నూతన కమిటీని మంగళవారం స్థానిక పాత పాల్వంచ ఆత్మలింగేశ్వరాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్‌దేశ్ పాండే, అఖిల భారత అన్నదాన సమితి అధ్యక్షుడు తాండ్ర రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడు తనుగుల శ్రీను, ఉపాధ్యక్షుడిగా అనుగోజు నటరాజ్, ప్రధాన కార్యదర్శిగా దోసపాటి చింటు, కోశాధికారిగా కేశబోయిన కోటేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా సర్వదేవభట్ల జితేందర్, గౌరవ అధ్యక్షుడిగా బాబానేని రాంబాబు, కొప్పురావూరి భాస్కర్‌రావు, గౌరవ సలహాదారులు గుగిపూడి మోహన్‌రావు, సుబ్రమణ్యం, సహాయ కార్యదర్శులుగా గుండా నర్సింహారావు, మల్లికార్జునరావు, మహేశ్, ఆధ్యాత్మిక ప్రచార కార్యదర్శి సురేష్, అన్నదాన కమిటీ సభ్యులు శ్రీకర దుర్గా ప్రసాద్, రాఘవేందర్‌రావు, నాగేందర్, ఉదయ్ భాస్కర్, శ్రీను, మల్లిఖార్జునరావు, సింహాద్రి కిరణ్‌లను ఎన్నుకున్నారు.

ఆలయంలో భక్తి గీతాలు

స్థానిక శ్రీ ఆత్మలింగేశ్వరాలయంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిరంతరాయంగా 12 గంటల పాటు ‘నీ గానమే నా ప్రాణం’అనే నిరంతర భక్తి గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాల్వంచ శాఖ ఆధ్వర్యంలో 52వ వేదిక ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి వంద మందికి పైగా గాయకులు తరలివచ్చారు. సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్‌పాండే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, అర్చకులు జితేందర్ శర్మ, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు

టేకులపల్లి: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి (ఏబీఏడీపీఎస్) జిల్లా కమిటీలో టేకులపల్లి నుంచి ముగ్గురికి చోటు లభించింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా అనుగోజు నటరాజ్, గౌరవ సలహాదారుడిగా గుడిపూడి మోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా గుండా నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


పోడు భూములకు పట్టాలివ్వండి..

టేకులపల్లి: తాతలకాలం నుంచి సాగులో ఉన్న భూములకు అధికారులకు పట్టాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. మంగళవారం బాధిత రైతులు విలేకరులకు తమ గోడు చెప్పుకున్నారు. టేకులపల్లి మండలం డబుల్ బెడ్ రూమ్ కాలనీ వెనకాల సర్వే నంబర్ 630 నుంచి 660 మధ్యలో 30 ఎకరాల వ్యవసాయ సాగు భూమిలో పలువురు రైతులు సాగు చేస్తున్నారు. 2012లో అప్పటి కలెక్టర్ పట్టాలు కూడా ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన కొత్త పట్టా భూములకు దరఖాస్తు చేసుకోగా పట్టాలు మంజూరు చేయలేదు. పట్టాలు లేకపోవడం వల్ల రుణాలు పొందలేకపోతున్నామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సాగు భూములను సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. మూడ్ కృష్ణ, భాస్కర్, హుస్సేన్, కస్నా, భద్రు, రమేష్, సల్త, భూక్యా లక్ష్మణ్, భూక్యా భద్రం, గుగులోత్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

చుంచుపల్లి: అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తగూడెంలోని శ్రీవిద్య పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. వనాలు వన్య ప్రాణులు మన జాతీయ సంపదని, వాటిని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. పులుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. కొత్తగూడెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు, టేకులపల్లి రేంజ్ ఆఫీసర్ ముక్తార్ హుస్సేన్, పార్క్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, జయ కాంతారావు, ముక్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా యానంబైల్ రేంజ్ పరిధిలోని గుత్తికోయ గుంపు ఆవాసాలైన మందేరకలపాడు, పెద్దకలశ, చిరుతానిపాడులో మంగళవారం ప్రదర్శన నిర్వహించి గిరిజనులకు పులులతోపాటు వన్యప్రాణుల సంరక్షణపై వైల్డ్‌లైఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఉచ్చులు, బాణాలతో జంతువులను వేటాడవద్దని, కాపాడాలని కోరారు. యానంబైల్ సెక్షన్ ఆఫీసర్ కిషన్, రేగులగూడెం సెక్షన్ ఆఫీసర్ కృష్ణయ్య, బీటు ఆఫీసర్లు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: అవగాహన కల్పిస్తున్న కిషన్